సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 28 । ఫిబ్రవరి । 2025

భక్త జనసాగరం

పుణ్యస్నానాలు ఆచరించిన జనం

మార్మోగిన శివనామస్మరణ







సాగరతీరం శివనామస్మరణతో పులకించింది. శంభో శంకర.. హర హర మహాదేవ నినాదం సాగర ఘోషను మించిపోయింది. భక్తులు శివరాత్రి జాగరణ పూర్తి చేసి ఉదయం పుణ్యస్నానాలు ఆచరించారు.

ఓటేసే వరకూ ప్రలోభాలు!



చంద్రంపాలెం పాఠశాలలో ఓటు వేయడానికి క్యూలో ఉన్న ఉపాధ్యాయులు

పోలింగ్ కేంద్రాల దగ్గరే తిష్టవేసిన టీడీపీ, జనసేన నేతలు

పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సమయంలోనూ టీచర్ల వెంటే..

కొన్ని ప్రాంతాల్లో ఏజెంట్లుగా వ్యవహరించిన అధికార పార్టీ నేతలు

ప్రశాంతంగా ముగిసిన ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు

విశాఖ జిల్లాలో 87.57 శాతం పోలింగ్ నమోదు

గురువులు 'ఫస్ట్' మార్క్ ఎవరికిచ్చారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన నేతలు హల్‌చల్ చేశారు. తాము మద్దతిస్తున్న అభ్యర్థికి ఓటేయాలంటూ ఉపాధ్యాయులను చివరి నిమిషం వరకూ ప్రలోభ పెట్టేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కి పోలింగ్ జరుగుతున్న ప్రాంతాల వద్ద కలియతిరిగారు. చాలాచోట్ల అధికార పార్టీకి చెందిన నేతలు ఉపాధ్యాయుల స్థానంలో ఏజెంట్లుగా వ్యవహరించారు. ఓటు వేసేందుకు బూత్‌లోకి వెళ్లే సమయంలో టీచర్లను మభ్య పెట్టేందుకు ప్రయత్నించారు. మొత్తంగా విశాఖ జిల్లా పరిధిలో 87.34 శాతం మంది గురువులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసింది. ఉదయం తొలి గంటలో నెమ్మదిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నానికి పుంజుకుంది. జిల్లాలోని 13 పోలింగ్ కేంద్రాల పరిధిలో 5,529 ఓటర్లు ఉండగా 4,842 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లాలో 87.57 శాతం ఓటింగ్ నమోదైంది. ఉత్తరాంధ్ర పరిధిలోని ఆరు జిల్లాలతో పోలిస్తే విశాఖ జిల్లాలోనే అత్యల్పంగా పోలింగ్ శాతం నమోదైంది. అత్యధికంగా అనకాపల్లి జిల్లాలో 96.22 శాతం పోలింగ్ నమోదు కాగా.. అల్లూరి జిల్లాలోనూ 88.04 శాతం నమోదు కావడం విశేషం. మొత్తంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో 22,493 మంది ఓటర్లు ఉండగా 20,783 మంది ఓటేశారు. సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి 92.40 శాతం పోలింగ్ నమోదైంది. అన్ని జిల్లాల్లో జరిగే ఓటింగ్ సరళిని కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ పర్యవేక్షించారు. అనంతరం దాబాగార్డెన్స్ పరిధిలోని ప్రేమ హైస్కూల్, ఏయూ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు పోలింగ్ కేంద్రాల వద్ద కూర్చొని హడావుడి చేశారు.

పోలీసులకు పట్టలేదు..

పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకూ 144 సెక్షన్ విధించామని పోలీసులు ప్రకటించారు. కానీ ఎక్కడా ఆ పరిస్థితి కనిపించలేదు. పోలింగ్ కేంద్రానికి 50 మీటర్ల దూరంలోనే టీడీపీ, జనసేన నేతలు తమ బలాన్ని ప్రదర్శించారు. అయినా.. పోలీసులు అడ్డు చెప్పలేదు. పోలింగ్ స్లిప్పులు ఇచ్చే ప్రాంతంలో పదుల సంఖ్యలో అధికార పార్టీ నేతలు టీచర్ల వద్దకు వెళ్లి ప్రచారం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నా పట్టించుకోలేదు. మొత్తంగా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో పోలీసులు విజయవంతమైనా.. నిబంధనల ప్రకారం పోలింగ్ జరిపించడంలో మాత్రం విఫలమయ్యారు.

జిల్లాలో పోలింగ్ సరళి

ఉదయం 10 గంటలకు **21.74** శాతం

మధ్యాహ్నం 12 గంటలకు **44.04** శాతం

మధ్యాహ్నం 2 గంటలకు **72.38** శాతం

సాయంత్రం 4.గంటలకు **87.57** శాతం



చంద్రంపాలెం హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులకు సూచనలు చేస్తున్న సీపీ బాగ్చీ



జిల్లాలో ఓటర్లు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు
5,529	2,539	2,990
ఓటేసిన వారు	ఓటేసిన వారు	ఓటేసిన వారు
4,842	2,235	2,607









మేము ఓటేశాం: ఓటేసిన అనంతరం చూపుడు వేలు చూపిస్తున్న ఉపాధ్యాయులు



మధురవాడ చంద్రంపాలెం ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఎమ్మెల్యేకు నిబంధనలు పట్టవా..

మధురవాడ : టీడీపీ నాయకులకు ఎన్నికల నిబంధనలు పట్టలేదు. మధురవాడ చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ 120వ పోలింగ్ కేంద్రం వద్దకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నేరుగా వచ్చారు. ఆయన వెంట వచ్చిన 20 మంది టీడీపీ నాయకులు ఓటర్లను ప్రభావితం చేయడానికి ప్రయత్నం చేశారు. పార్టీ రహిత ఎన్నికలకు రాజకీయ రంగు పులిమి, యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించడం పట్ల పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



స్లిప్పులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వంశీ



స్ట్రాంగ్ రూమ్‌కు తాళం వేసే ప్రక్రియ పూర్తిచేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

స్ట్రాంగ్ రూమ్‌కు బ్యాలెట్ బాక్సులు

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన సామగ్రి ఏయూ ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు ఆయా జిల్లాల నుంచి గురువారం రాత్రికి చేరుకున్నాయి. బ్యాలెట్ యూనిట్లను అధికారులు దగ్గరుండి తీసుకురాగా స్థానిక అధికారులు పరిశీలించి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. ఈ ప్రక్రియను సహాయక రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్ పర్యవేక్షించారు. గురువులు ఎవరికి ఫస్ట్ మార్క్ ఇచ్చారనేది మార్చి 3న తేలనుంది.

జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో పోలైన ఓట్ల వివరాలు

పోలింగ్ కేంద్రం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
జెడ్‌పీ హైస్కూల్, నడుపూరు	101	96
జెడ్‌పీ హైస్కూల్, గాజువాక	708	614
పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల	954	863
ఏయూ ప్రైమరీ స్కూల్, చినవాల్తేరు	747	620
ప్రేమ యూపీ స్కూల్, డాబాగార్డెన్స్	265	244
కేఎన్ఎం హైస్కూల్, రైల్వే న్యూకాలనీ	500	408
ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, కంచరపాలెం	421	371
జీవీఎంసీ ప్రైమరీ స్కూల్, మల్కాపురం	166	154
ఎస్‌వీఎల్ఎన్ జెడ్‌పీహైస్కూల్, గోపాలపట్నం	369	341
జెడ్‌పీ హైస్కూల్, చంద్రంపాలెం	908	763
ఎంపీపీ స్కూల్, పద్మనాభం	85	84
ఎంపీ ప్రైమరీ స్కూల్, ఆనందపురం	44	43
మహాత్మాగాంధీ యూపీ స్కూల్, భీమిలి	261	241
మొత్తం	5,529	4,842

ఎలక్షన్ అబ్జర్వర్ నాయక్ పరిశీలన

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియతో పాటు కేంద్రాల వద్ద పరిస్థితులను ఎన్నికల పరిశీలకులు ఎం.ఎం.నాయక్ సమీక్షించారు. కలెక్టర్‌తో కలిసి ఏయూ ప్రాథమిక పాఠశాల పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ పరిస్థితులను గమనించారు. కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుకొని అన్ని జిల్లాల్లో జరుగుతున్న పోలింగ్ తీరును అధికారులతో కలిసి సమీక్షించారు. రిటర్నింగ్, సహాయక అధికారులకు, ఆయా జిల్లాల పరిధిలోని ఏఆర్వోలకు తగిన ఆదేశాలు జారీ చేశారు.



ఏయూ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద ఉపాధ్యాయుల సందడి



తోడుగా వస్తున్న ఉపాధ్యాయురాలు, ఓటరుకు సహాయం చేస్తున్న పోలీసు, ఓటేసి వస్తున్న టీచర్స్

న్యూస్‌రీల్

రాజీపడదగ్గ కేసుల్ని పరిష్కరించండి



సమావేశంలో న్యాయమూర్తులు, మేజిస్ట్రేట్‌లు, బీమా కంపెనీల అధికారులు, తదితరులు

అల్లిపురం: మోటారు ప్రమాద నష్టపరిహార కేసులు, చెక్ బౌన్స్, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసుల్ని మార్చి 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ కోరారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ అధ్వర్యంలో గురువారం జిల్లాకోర్టులో జరిగిన సమావేశంలో ఆయన ఈ కేసులపై సమీక్ష నిర్వహించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, ఎన్‌బీడబ్ల్యూ పెండింగ్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించవచ్చన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై ఎక్కువగా దృష్టిసారించాలన్నారు. సమావేశంలో ప్రజా న్యాయ పీఠం న్యాయమూర్తి వల్లభనాయుడు, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకటరమణ, రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్, స్పెషల్ కోర్టు మేజిస్ట్రేట్‌లు, పోలీసు అధికారులు, బీమా, చిట్ ఫండ్ కంపెనీల ప్రతినిధులు, బ్యాంకు ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకం తప్పనిసరి

ఇన్‌చార్జ్ డీటీవో ఆర్‌సీహెచ్ శ్రీనివాస్



హెల్మెట్ లేని వాహనదారులపై కేసులు రాస్తున్న రవాణాశాఖ అధికారులు

గోపాలపట్నం: ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఇన్‌చార్జ్ డీటీవో ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో రవాణా శాఖ అధికారులు నగరంలో పలుచోట్ల వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వాహనం నడిపే వ్యక్తితో పాటు, వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాతోపాటు, 3 నెలలు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. లైసెన్స్ రద్దు చేసిన సమయంలో వాహనం నడిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్-2024పై అభిప్రాయ సేకరణ

దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో 2024 ఏడాదికి సంబంధించి స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అభిప్రాయ సేకరణ ప్రారంభమైందని, నగర ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశాల మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. వ్యర్థాల సేకరణ, తరలింపు, రోడ్లు, కాలువల శుభ్రత, మార్కెట్లు, బజార్లు, పార్కులు, ఉద్యానవనాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో పరిశుభ్రత, రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ కేంద్రాలు, వాటి వినియోగంపై ప్రజలకు అవగాహన తదితర అంశాలపై ప్రజల తమ అభిప్రాయాలు చెప్పాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం అడిగే ప్రశ్నలకు నేరుగా అభిప్రాయం చెప్పవచ్చన్నారు. అలాగే https://sbmurban.org/లో గానీ, Swachata MOHUA యాప్ ద్వారా గానీ అభిప్రాయాలు వ్యక్తం చేయవచ్చని సూచించారు.

ఉక్కు ఉద్యోగులకు జనవరి జీతం చెల్లింపు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఉద్యోగులకు జనవరి నెల జీతాన్ని శాతాలవారీగా గురువారం చెల్లించింది. ఎస్-1 నుంచి ఎస్-6 గ్రేడ్ కార్మికులకు పూర్తి(100 శాతం) జీతం చెల్లించగా, ఎస్-7, ఆ పైగ్రేడ్ కార్మికులు, అధికారులకు 75 శాతం చెల్లించారు. ఈ చెల్లింపుల ద్వారా ఎస్-6 వరకు ఉన్న కార్మికులకు 155 శాతం, ఎస్-7, ఆ పైగ్రేడ్ కార్మికులు, అధికారులకు 180 శాతం జీతం బకాయి ఉంది. ఎన్నడూ లేని విధంగా ఈసారి కార్మికులను రెండు గ్రూపులుగా విడదీసి, జీతం చెల్లించడం పట్ల కార్మిక వర్గాల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. కొంత మంది ఓటు రాజకీయాలు చేసే కార్మిక నాయకులు యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి, రెండు గ్రూపులుగా విడదీశారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శివరాత్రి ఆదాయం రూ.కోటి

300 ప్రత్యేక బస్సులు నడిపిన ఆర్టీసీ



మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు

దాబాగార్డెన్స్/కూర్మన్నపాలెం: మహాశివరాత్రి పురస్కరించుకుని వివిధ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపడం ద్వారా ఆర్టీసీకి రూ.కోటి వరకు ఆదాయం సమకూరిందని జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని శివాలయాలకు సర్వీసులు నడిపినట్లు చెప్పారు. కూర్మన్నపాలెం జంక్షన్‌లో గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. అంతకుముందు గాజువాక డిపో నుంచి అప్పికొండ, ఆర్‌కే బీచ్‌కు ప్రత్యేక బస్సులు ప్రారంభించారు. శివరాత్రి జాగరణ అనంతరం సముద్ర స్నానాలు ఆచరించే భక్తుల కోసం 26వ తేదీ అర్ధరాత్రి నుంచి 27 సాయంత్రం వరకు నగరంలోని అన్ని డిపోల నుంచి బస్సులు నడిపినట్లు చెప్పారు. గాజువాక, కూర్మన్నపాలెం, అగనంపూడి ప్రాంతాల నుంచి అప్పికొండకు, అలాగే తగరపువలస, భీమిలి, ఆరిలోవ కాలనీ, రవీంద్రనగర్, పెందుర్తి, కొత్తవలస, సింహాచలం, గాజువాక, కూర్మన్నపాలెం తదితర ప్రాంతాల నుంచి ఆర్‌కే బీచ్‌కు సూపర్‌వైజర్లు, సిబ్బంది పర్యవేక్షణలో సుమారు 300 ప్రత్యేక బస్సులను నడిపినట్టు అప్పలనాయుడు వివరించారు. భక్తుల సౌకర్యార్థం ముఖ్య కూడళ్ల వద్ద టెంట్లు వేసి.. ఒక్కో చోట నలుగురు సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. మంచి నీరు, మజ్జిగ వంటి సదుపాయాలు కల్పించినట్లు వివరించారు. ఒక్క అప్పికొండ తీర్థ యాత్ర వల్ల ఆర్టీసీకి రూ.30 లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు చెప్పారు. గతేడాది కంటే ఈ ఏడాది రెట్టింపు ఆదాయం లభించినట్లు వెల్లడించారు. పుణ్యగిరి, నర్సీపట్నం, కల్యాణపులోవ తదితర పుణ్యక్షేత్రాలకు కూడా నగరంలోని వివిధ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు పంపించామన్నారు. డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ సత్యనారాయణ, సింహాచలం డిపో మేనేజర్ కె.రాజశేఖర్, వాల్తేర్ డిపో మేనేజర్ కె.సుధాకర్, స్టీల్ సిటీ డిపో మేనేజర్ గౌతమ్ చటర్జీ, గాజువాక డిపో మేనేజర్ వి.ప్రవీణ, పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సేవలను మరింత మెరుగుపరచాలి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విశాఖ సిటీ : ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందే సేవలను మరింత మెరుగుపరచాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ అంశాలపై మార్గదర్శకాలు ఆయన చేశారు. ఉచిత గ్యాస్, రేషన్ బియ్యం పంపిణీ, తూనికలు, కొలతలు, ఇతర ప్రమాణాలు పాటించే క్రమంలో జాగ్రత్తలు వహించాలని చెప్పారు. ఎక్కడా ఎలాంటి అవకతవకలు జరగకుండా పారదర్శకంగా సేవలు అందించాలని చెప్పారు. గోదాముల నుంచి రేషన్ దుకాణాలకు సరఫరా చేసే బియ్యం బరువు విషయంలో లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎండీయూ వాహనాల ద్వారా సరుకులు సకాలంలో అందించాలన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు నిర్వహించాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఎస్‌వో కల్యాణి, పౌర సరఫరా శాఖ డీఎం శ్రీలత, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రేపు ఏయూ వీసీ బాధ్యతల స్వీకరణ

విశాఖ విద్య: ఏయూ వీసీగా ఆచార్య జి.రాజశేఖర్ మార్చి ఒకటో తేదీన బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు స్వాగత ఏర్పాట్లకు అంతా సిద్ధం కావాలని రిజిస్ట్రార్ ఎన్.ధనుంజయరావు వర్సిటీ కాలేజీల విభాగాధిపతులకు గురువారం సర్క్యులర్ జారీ చేశారు. ఆ రోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు మాత్రమే విజిటర్స్‌కు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.





జోడుగుళ్లపాలెం తీరంలో ఆధ్యాత్మిక సందడి



అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో బారులుతీరిన భక్తులు

భక్త జనసాగరం

తీరానికి పోటెత్తిన భక్తులు • పుణ్యస్నానాలు ఆచరించిన జనం • మార్మోగిన శివనామస్మరణ

ఏయూక్యాంపస్/పెదగంట్యాడ/ఆరిలోవ: సాగర తీరం శివనామస్మరణతో పులకించింది. శంభో శంకర.. హర హర మహాదేవ నినాదం సాగర ఘోషను మించిపోయింది. భక్తులు శివరాత్రి జాగరణ పూర్తి చేసి ఉదయం పుణ్యస్నానాలు ఆచరించారు. బుధవారం ఉదయం నుంచి శివాలయాల్లో అభిషేకాలు జరిపి, రాత్రి లింగోద్భవ సమయం వరకు శివనామ స్మరణతో గడిపారు. గురువారం తెల్లవారుజాము నుంచి సముద్ర స్నానాలకు నగరం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తీరానికి తరలివచ్చారు. దీంతో అప్పికొండ, జోడుగుళ్లపాలెం, రామకృష్ణ బీచ్, పాండురంగాపురం, వైఎంసీఏ, వీఎంఆర్డీఏ పార్క్, అప్పుఘర్, తెన్నేటిపార్క్, సాగర్ నగర్, రుషికొండ తదితర బీచ్‌లు కిటకిటలాడాయి. సముద్ర స్నానాలు ఆచరిస్తూ ప్రత్యక్ష దైవం సూర్యభగవానుడికి, పరమేశ్వరుడికి ప్రణతులు అర్పించారు. మహిళలు తీరంలో సైకత లింగాన్ని తయారు చేసి పూజలు జరిపారు. అనంతరం సమీపంలోని శివాలయాలను దర్శించుకుని పూజలు చేశారు. భక్తులు భారీగా తరలిరావడంతో పోలీసులు పటిష్ట భద్రత చేపట్టారు. అడుగడుగునా మైకుల్లో హెచ్చరిస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. ఉదయం ఆర్.కె.బీచ్ నుంచి వైఎంసీఏ వరకు వాహనాలను అనుమతించలేదు. అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. వేలాది మంది ఇక్కడ పుణ్యస్నానాలు ఆచరించారు. 100 మంది గజ ఈతగాళ్లతో ఇక్కడ భద్రత ఏర్పాట్లు చేశారు.





ప్రమాదకర ప్రయాణం.. భద్రతే ప్రధానం



ఏయూ క్యాంపస్: మహా శివరాత్రి అనంతరం ఆచరించే సముద్ర స్నానాలకు వచ్చిన కొంత మంది ప్రమాదకర ప్రయాణాలు చేశారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, వ్యాన్‌లపై పరిమితికి మించి ప్రయాణించారు. భక్తి పారవశ్యంతో ఉన్నా.. ప్రయాణంలో ఎంతో జాగరూకతతో వ్యవహరించాలి. చిన్నపాటి తప్పు జరిగినా విలువైన ప్రాణాలకు ముప్పు తప్పదు. ప్రమాదకరంగా సాగిన కొన్ని ప్రయాణాలను సాక్షి క్లిక్ మనిపించింది. ప్రజలు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ, సురక్షిత ప్రయాణాలు చేయాలి. ప్రతి వ్యక్తి వెనుక ఒక కుటుంబం ఉంటుందనే విషయం మరువకూడదు. తస్మాత్ జాగ్రత్త.. భద్రతే ప్రధానం.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

పిల్లి.. తల్లడిల్లి!



ఆస్పత్రిలో టీకా వేయిస్తున్న అంజలి

విశాఖ విద్య: అల్లారుముద్దుగా పెంచుకుంటున్న పిల్లికి జ్వరం రావడంతో ఆ యువతి తల్లడిల్లిపోయింది. ఆస్పత్రికి తీసుకెళ్లి ఇంజక్షన్లు వేయించిన తర్వాత గానీ ఆ మనసు కుదుటపడలేదు. ఎన్‌ఏడీ సెంటర్ దగ్గర నేతాజీ వీధికి చెందిన అంజలి గోపాలపట్నం ప్రాంతీయ పశు వైద్యశాల వద్ద గురువారం పిల్లిని లాలిస్తూ.. ప్రేమగా స్పర్శిస్తూ.. ఓదారుస్తూ కనిపించింది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన ఆమెకు మూగజీవాలంటే ప్రాణం. మూగజీవాలు తమ బాధను ఎవరితో చెప్పుకోలేవని.. చిన్నప్పటి నుంచి పిల్లుల మధ్య పెరగడం వల్ల వాటితో విడదీయరాని అనుబంధం ఏర్పడిందని ఆమె తెలిపారు.

గంజాయి కలిగి ఉన్న వ్యక్తికి పదేళ్ల జైలు

విశాఖ లీగల్: గంజాయి కలిగి ఉన్న వ్యక్తికి 10 ఏళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయిలు జరిమానా విధిస్తూ నగరంలోని ప్రధాన మెట్రోపాలిటిన్ సెషన్ జడ్జి ఎం.వెంకటరమణ గురువారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో స్పష్టం చేశారు. ప్రథమ శ్రేణి ప్రత్యేక పబ్లిక్ ప్యాసిక్యూటర్ బి.ఎస్.ఎస్.ప్రసాద్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు గజ్జి సత్తిబాబు(40) అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం చీడి గుమ్మల పంచాయతీ పోలవరం గ్రామ నివాసి, వృత్తిరీత్యా ట్రాక్టర్ డ్రైవర్. 2014 నవంబర్ 22వ తేదీన ముందస్తు సమాచారం మేరకు గొలుగొండ తహసీల్దార్, గొలుగొండ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా పాకలపాడు గ్రామం నుంచి చీడి గుమ్మల వైపు వస్తున్న ట్రాక్టర్‌లో 183 కేజీల గంజాయిని మైదాన ప్రాంతానికి తరలిస్తున్నట్లు గుర్తించారు. అప్పటి ఎస్ఐ ఎన్.జోగారావు నిందితుడిపై కేసు నమోదు చేసి నేరాభియోగపత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

ఓటేసి వచ్చి... కుప్పకూలి...

గుండెపోటుతో టీచర్ మరణం



మృతి చెందిన వరహా గిరి వెంకటరామారావు

అనకాపల్లి: టీచర్స్ ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకొని స్థానిక గాంధీనగరం చెందిన వరహా గిరి వెంకటరామారావు(54) ఇంట్లో సోఫాలో కుప్పకూలి గుండె పోటుతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కశింకోట మండలం కొత్తపల్లి బుచ్చియ్యపేట హైస్కూల్‌కు చెందిన రామారావు లెక్కల ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పట్టణంలో ఉడ్‌పేట ఎలిమెంటరీ పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకొన్నారు. ఇంటికి వెళ్లి సోఫాలో కూర్చున్న తర్వాత ఒక్కసారిగా కూప్పకూలిపోయారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

'సుప్రీం' ఆదేశాలు బేఖాతర్

- నిర్దిష్ట ఆదేశాలున్నా.. తేలని శాంతి ఆశ్రమం భూముల పంచాయితీ
- గురువారం 11 గంటల్లోపు అప్పగించాలని లీజుదారులకు సుప్రీం కోర్టు ఆదేశం
- సాయంత్రం 4 గంటల వరకు వేచి ఉన్నప్పటికీ.. అప్పగించని లీజుదారులు



పోలీసులు, న్యాయవాదులతో కలిసి స్థలం పరిశీలిస్తున్న ఇరువర్గాలు



పెట్రోల్ బంక్ వద్ద అతికించిన నోటీసులు

ఎంవీపీకాలనీ: లాసన్స్ బే కాలనీలోని శాంతి ఆశ్రమం భూముల విషయంలో లీజుదారులు సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం బేఖాతర్ చేయడం చర్చనీయాంశంగా మారింది. కోర్టు ఆదేశాల మేరకు లీజులో ఉన్న భూములను స్వాధీనం చేసుకోవడానికి గురువారం సాయంత్రం 4 గంటల వరకు ఆశ్రమ యాజమాన్యానికి చెందిన పిటిషన్‌దారులు, రెవెన్యూ, పోలీసు అధికారులు వేచి చూసినా.. ఫలితం లేకపోయింది. దీంతో లీజుదారులు కోర్టు ధిక్కరణకు పాల్పడిన అంశాన్ని మరోసారి సుప్రీంకోర్టు ముందు ఉంచాలని ఆశ్రమానికి చెందిన పిటిషన్‌దారులు నిర్ణయించారు. పిటిషన్‌దారులు తెలిపిన వివరాలివీ..

దశాబ్దాల కిందట యోగా, మెడిటేషన్ సెంటర్ల నిర్వహణ పేరుతో ఉప్పలపాటి వివేకానంద కుటుంబం శాంతి ఆశ్రమం నిర్వాహకుడు యోగి రాఘవేంద్ర ద్వారా 6.4 ఎకరాల స్థలం లీజుకు తీసుకుంది. నిబంధనలకు విరుద్ధంగా ఆ స్థలంలో పెట్రోల్ బంక్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, కార్ షెడ్లు, మల్టీ పార్కింగ్ ప్రాంతాలుగా అద్దెలకు ఇచ్చి.. ఆ స్థలాన్ని వివేకానంద కుటుంబ సభ్యులు కమర్షియల్‌గా వాడుకుంటున్నారు. లీజు నిబంధనలకు విరుద్ధంగా వినియోగించుకుంటున్న స్థలాన్ని వెనక్కి ఇచ్చేయాలంటూ శాంతి ఆశ్రమ యాజమాన్యం కోర్టులను ఆశ్రయించింది. 25 ఏళ్ల సుదీర్ఘ న్యాయ పోరాటం అనంతరం సుప్రీం కోర్టు ఆ లీజు స్థలాలను వెనక్కి ఇచ్చేయాలంటూ తీర్పునిచ్చింది. అయితే వివేకానంద కుటుంబం అందుకు సమయం కోరగా.. రెండు సార్లు అవకాశం కల్పించింది. ఆ సమయంలో లీజుదారులు కోర్టులో సానుకూల ఆదేశాల కోసం ప్రయత్నించి పలు పిటిషన్లు దాఖలు చేశారు. అయినప్పటికీ కోర్టు వాటిని తోసిపుచ్చడంతో పాటు ఆ భూమిని ఆశ్రమానికి అప్పగించాల్సిందేనని తేల్చి చెప్పింది. కాగా..ఈ భూమిలో కొంత స్థలం వివిధ పార్టీ కార్యాలయాలకు వెళ్లినట్లు లీజుదారులు కోర్టుకు తెలిపారు. దీంతో నాలుగు ఎకరాల లీజు భూమిని స్వాధీనం చేయడానికి గతంలోనే అంగీకరించారు. అయితే అందుకు అనుగుణంగా అప్పగించకపోవడంతో కోర్టు మరోసారి ఆదేశాలు జారీ చేసింది. ఆ 4 ఎకరాల భూమిని గురువారం(ఈ నెల 27) ఉదయం 11 గంటల్లోపు భూములను ఆశ్రమం యాజమాన్యానికి అప్పగించాలని స్పష్టం చేశారు. పోలీసు, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరగాలని ఆదేశాలు జారీ చేసింది.

సాయంత్రం 4 గంటల వరకు వేచి చూసినా.!

ఈ క్రమంలో ఆశ్రమ యాజమాన్య ప్రతినిధులు, ఎంవీపీ సీఐ మురళీ తదితరులు గురువారం ఉదయం లీజు భూములను పరిశీలించారు. కోర్టు ఆదేశాల మేరకు లీజు భూమంతా అప్పగించాలని పిటిషనర్ తరఫు న్యాయవాదులు ప్రతివాదులకు సూచించారు. వివేకానంద కుటుంబ సభ్యులతో పలుమార్లు మాట్లాడారు. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఆ భూమిని అప్పగించాలని సూచించారు. సాయంత్రం 4 గంటల వరకు అక్కడే వేచి ఉన్నారు. అయినప్పటికీ వివేకానంద కుటుంబ సభ్యులైన జి.గౌతమ్, కె.శ్రీదేవి ఆ భూములను అప్పగించలేదు. దీంతో కోర్టు నోటీసులను వారు అద్దెలకు(సబ్‌లీజులకు) ఇచ్చిన పెట్రోల్ బంక్, డ్రైవ్ ఇన్ రెస్టారెంట్, బస్సుల పార్కింగ్, క్రికెట్ కోచింగ్ సెంటర్, కార్ వాష్ సెంటర్లకు అతికించినట్లు ఆశ్రమ యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. లీజుదారులు భూమిని స్వాధీనం చేయకపోతే 28వ తేదీ తమ దృష్టికి తీసుకురావాలని సుప్రీం కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొన్న నేపథ్యంలో.. ఈ వ్యవహారాన్ని శుక్రవారం కోర్టు దృష్టికి తీసుకెళ్లనునట్లు వెల్లడించారు.

హోటల్‌లో అగ్నిప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న సూర్యాబాగ్ ఫైర్ సిబ్బంది



హోటల్‌లో బస చేసిన వారిని కిందకి దించుతున్న ఎస్ఐ సతీష్

అల్లిపురం: డాబాగార్డెన్స్ అంబేడ్కర్ సర్కిల్ వద్ద గల ఎల్‌జీ హోటల్‌లో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్ ప్యానెల్ బోర్డు వద్ద షార్ట్ సర్క్యూట్ కావడంతో సెల్లార్ మొత్తం పొగతో నిండిపోయింది. ఆ పొగ హోటల్‌లోని అన్ని అంతస్తుల్లోకి వ్యాపించింది. సమాచారం అందుకున్న టూటౌన్ ఎస్ఐ సతీష్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. హోటల్‌లో ఫైర్ ఎక్విప్‌మెంట్ ఉండటంతో ఫైర్ సిబ్బంది వచ్చేలోగా మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఈ లోగా సూర్యాబాగ్ ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కరెంట్ లేకపోవడంతో హోటల్ మొత్తం చీకటిగా మారిపోయింది. ఈ క్రమంలో ఎస్ఐ సెల్‌ఫోన్ టార్చి సహకారంతో అన్ని అంతస్తుల్లోని 9 గదుల్లో బస చేసిన వారిని నిద్రలేపి అప్రమత్తం చేశారు. వారందరినీ కిందకు తరలించారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం గానీ, ఆస్తి నష్టం గానీ జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

మెట్లు ఎక్కుతూ కుప్పకూలిపోయాడు

గుండెపోటుతో వృద్ధుడు మృతి



మందులు తీసుకునే లోపే మరణించిన వృద్ధుడు

డాబాగార్డెన్స్: మందులు కొనుక్కుందామని మెడికల్ షాపునకు వచ్చిన వృద్ధుడు.. షాపు మెట్లు ఎక్కుతూనే ప్రాణాలు విడిచాడు. ఈ విషాద ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా మొరకముడిదాం మండలం, ముదరాయవలస గ్రామానికి చెందిన రెడ్డి రమణ(65) హ్యాడ్రోగం, షుగర్, బీపీతో బాధపడుతున్నారు. రెండు రోజుల కిందట నగరంలో ఒక డాక్టరు వద్ద ట్రీట్‌మెంట్ నిమిత్తం వచ్చారు. గురువారం ఉదయం మందులు కొనుగోలు చేసేందుకు నీలమ్మ వేపచెట్టు వద్దనున్న ఒక మెడికల్ షాపునకు వెళ్లారు. షాపు మెట్లు ఎక్కుతుండగానే ఆయన ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. స్థానికులు ఆయనకు సపర్యలు చేసేందుకు ప్రయత్నించగా.. అప్పటికే ఆయన మరణించినట్లు గుర్తించారు. వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆయన దగ్గర లభించిన వివరాల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. ఆయన కుమారుడు రెడ్డి దాలినాయుడు సాయంత్రానికి టూటౌన్ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దానాపూర్-చర్లపల్లి మధ్య వన్ వే స్పెషల్



తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దానాపూర్-చర్లపల్లి స్టేషన్ల మధ్య వన్ వే స్పెషల్ నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. దానాపూర్-చర్లపల్లి(03299) వన్ వే స్పెషల్ శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు దానాపూర్‌లో బయల్దేరి మరుసటిరోజు సాయంత్రం 6.25 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు విజయనగరం, కొత్తవలస స్టేషన్‌లలో ఆగుతుంది.

2న జూలో పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో మార్చి 2న విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించనున్నట్లు జూ క్యూరేటర్ జి.మంగమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఈ పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో 1 నుంచి 5వ తరగతి విద్యార్థులు సీతాకోక చిలుకలు, పక్షులు, తేనెటీగలు ఎందుకు ముఖ్యమైనవి అనే అంశంపైన, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు వన్యప్రాణులను రక్షించడంలో సాంకేతికత పాత్ర, ఇంటర్ నుంచి పీజీ విద్యార్థులు వన్యప్రాణి సంరక్షణ ఫైనాన్స్-స్థిరమైన భవిష్యత్‌కు కీలకం అనే అంశాలపై పోస్టర్లు ఇంటిలోనే సిద్ధం చేసుకోవాలన్నారు. వాటిని పోటీలో ప్రెజెంట్ చేయాలని పేర్కొన్నారు. ఈ పోటీలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు జూ లోపల ఉన్న బయోస్కోప్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

పోసాని అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నాం

వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ



సాక్షి, విశాఖపట్నం: సినీ నటుడు, ఏపీఎఫ్‌డీసీ మాజీ అధ్యక్షుడు పోసాని కృష్ణమురళి అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ అన్నారు. అక్కయ్యపాలెంలోని తన కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ అరాచకాలు రోజురోజుకు ఎక్కువైపోతున్నాయని, వీటికి అంతం లేకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పోసాని కృష్ణమురళికి ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమన్నారు. లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని పోలీసులు అనుసరిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి, ప్రజా సమస్యలపై దృష్టి సారించకుండా.. కేవలం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు.

యువకుడిని ఢీకొన్న స్కూల్ బస్సు

రోడ్డు దాటుతుండగా ఘటన



చికిత్స పొందుతున్న వెంకటేష్

మద్దిపాలెం: రోడ్డు దాటుతున్న ఓ యువకుడిని అతివేగంగా వచ్చిన ఓ ప్రైవేట్ స్కూల్ బస్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. క్షతగాత్రుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి.. సాక్షి దినపత్రికలో సీటీపీ స్కానింగ్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న పొట్నూరు వెంకటేష్ కంచరపాలెం దరి కప్పరాడలో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. ఈ నెల 25న విధులు ముగించుకుని.. ఉదయం 8.15 గంటల ప్రాంతంలో కప్పరాడ వద్ద ఆటో దిగి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో అక్కయ్యపాలెం నుంచి ఎన్‌ఏడీ వైపు వెళ్తున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన బస్సు(ఏపీ39 యూడబ్ల్యూ 3237) అతివేగంగా వస్తూ రోడ్డు దాటుతున్న వెంకటేష్‌ను ఢీకొంది. దీంతో యువకుడు సర్వీస్ రోడ్డులోని స్టాపర్‌పై పడిపోవడంతో అతనికి ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అనంతరం శస్త్రచికిత్స చేసి వైద్య సేవలందిస్తున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే తన కుమారుడికి ఇలా జరిగిందని అతని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ సీఐ దాశరథి నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను రక్షించిన లైఫ్‌గార్డులు



బాలిక,కుటుంబ సభ్యులతో పోలీసులు, లైఫ్‌గార్డ్‌లు

ఆరిలోవ: మహా శివరాత్రి పుణ్యస్నానాల కోసం గురువారం జోడుగుళ్లపాలెం బీచ్‌కు వచ్చిన ఓ బాలిక కెరటాల్లో చిక్కుకుంది. జీవీఎంసీ లైఫ్‌గార్డులు వెంటనే స్పందించి ఆమెను ప్రాణాలతో రక్షించారు. వివరాలివీ.. ద్వారకానగర్ ప్రాంతం నుంచి సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు జోడుగుళ్లపాలెం బీచ్‌కు గురువారం మధ్యాహ్న సమయంలో సముద్ర స్నానాలకు వెళ్లారు. అక్కడ స్నానాలు చేస్తుండగా.. అతని కుమార్తె కెరటాలలో చిక్కుకుని లోపలకు వెళ్లిపోయింది. ఇది గమనించిన సుబ్రహ్మణ్యం, అతని కుటుంబ సభ్యులు బాలికను రక్షించడానికి లోపలకు వెళ్లగా.. వారు కూడా కెరటాల మధ్యలో చిక్కుకున్నారు. ఈ క్రమంలో వారంతా పెద్దగా కేకలు పెట్టడంతో అక్కడే ఉన్న జీవీఎంసీ లైఫ్‌గార్డులు రమేష్, రాజు, లక్ష్మణ్, సాయి వెంటనే స్పందించి ఆ బాలికతో పాటు కుటుంబ సభ్యులను రక్షించి ఒడ్డుకు చేర్చారు. విషయం తెలుసుకున్న ఆరిలోవ ఎస్ఐ కృష్ణ, కానిస్టేబుళ్లు అక్కడకు చేరుకుని వారికి వైద్య పరీక్షలు చేయించారు. ప్రాణాలతో బయటపడిన సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు లైఫ్‌గార్డులు, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

డీపీఎస్‌లో ఎమ్మెల్సీ ఓటు నమోదు వివాదం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్)లో ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు అంశంలో వివాదం ఏర్పడింది. ఆ పాఠశాలలో ఉపాధ్యాయులకు ప్రిన్సిపాల్ ఓటు నమోదుకు అవకాశం కల్పించలేదని ఆరోపణలు రాగా.. ప్రిన్సిపాల్ ఆ ఆరోపణలను తిరస్కరించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ పోలింగ్ నేపథ్యంలో గురువారం గాజువాకకు చెందిన ఆర్‌టీఐ ఫోరం కన్వీనర్ కృష్ణకుమార్‌కు డీపీఎస్‌కు చెందిన కొంత మంది ఫోన్ చేశారు. 60 మంది ఉపాధ్యాయులకు ఓట్లు లేవని, ప్రిన్సిపాల్ వల్లే వారు ఓటు హక్కు కోల్పోయారని ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే ఏఆర్వో, డీఆర్వో భవానీ ప్రసాద్, డీఈవో ప్రేమ్‌కుమార్ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లారు. దీనిపై డీఈవో స్పందించి, గాజువాక ఎంఈవోను విచారణకు ఆదేశించారు. ఆయన పాఠశాలకు చేరుకుని విచారించారు. గత ఎన్నికల వలె ఎమ్మెల్సీ అభ్యర్థులు ఓటు నమోదు చేయిస్తారనే ఉద్దేశంతో.. తాము ఓటు నమోదు చేయించుకోలేదని అక్కడి ఉపాధ్యాయులు తెలిపినట్లు ఎంఈవో వెల్లడించారు. దీనిపై ప్రిన్సిపల్‌తో మాట్లాడగా, వచ్చిన ఓటరు నమోదు దరఖాస్తులు అర్హులైన ఉపాధ్యాయులకు అందజేశామన్నారు. తాము ఎవరినీ అడ్డుకోలేదని చెప్పారు. ఫోరం కన్వీనర్ కృష్ణకుమార్ మాట్లాడుతూ ఓటు నమోదును అడ్డుకున్న ప్రిన్సిపాల్‌పై జేసీకి ఫిర్యాదు చేశానని, విచారించి చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారని వెల్లడించారు.